ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
మంగళవారం 14 జనవరి 2025



పండగ స్పెషల్ 'గేవర్'



తరాలు మారినా తరగని తీయదనం

తాండూరులో సంక్రాంతికి ప్రత్యేకం 7

దశాబ్దాలుగా నోరూరిస్తున్న వంటకం

అరుదైన శిల్ప సంపదను పరిరక్షించాలి

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి
- శంకర్‌పల్లి, కంకల్‌లో జైన శిల్పాలు లభ్యం

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాదు జిల్లా, పూడూరు మండలం, శంకర్‌పల్లి, కంకల్ గ్రామాల్లో దాదాపు 50కి పైగా చారిత్రక శిల్పాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. కంకల్ గ్రామంలోని గణేశాలయం, శివాలయంతోపాటు గ్రామంలో పలు ప్రాంతాల్లో బాదామీ చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణీచాళుక్య, కాకతీయల కాలపు అపురూప శిల్పాలను గుర్తించామన్నారు. బాదామీ చాళుక్య కాలపు (క్రీ.శ. 8వ శతాబ్ది) నిలువెత్తు గణేశ, నంది శిల్పాలు, రాష్ట్రకూటుల కాలపు జైన పార్శ్వనాథ, మహావీర, యక్ష, యక్షణీ శిల్పాలు, కళ్యాణీచాళుక్యుల కాలపు నాగదేవతలు, కాకతీయుల కాలపు సప్తమాతృక, శత్రు సంహారంలో ప్రాణాలొదిలిన వీరుల శిల్పాలతోపాటు పలు శాసనాలు నాశనం అవుతున్నాయన్నారు. అంతేకాకుండా మసీదు వెనుక వైపునున్న పార్శ్వనాథుడు, యక్ష, యక్షిణీ శిల్పాలు, గ్రామం మధ్యలోనూ, చివర



శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

చింతచెట్టు కింద ఉన్న వర్ధమాన మహావీరుని విగ్రహాలు రాష్ట్ర కూటుల శిల్పశైలికి అద్దం పడుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరు, వికారాబాదు జిల్లాలోని ఎల్లకొండతో పాటు కంకల్ కూడా వెయ్యేళ్ల క్రితం దిగంబర జైనక్షేత్రమని ఈ శిల్పాలు రుజువు చేస్తున్నాయన్నారు. జైన, శైవ శాఖలకు చెందిన అరుదైన శిల్పాలున్న కొంకల్ గ్రామాన్ని హెరిటేజ్ విలేజ్‌గా ప్రకటించి, శిల్ప సంపదను కాపాడాలని జిల్లా యంత్రాగానికి శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గట్టుపల్లి మల్లేశ్, నీరటి రాములు, చిన్నికృష్ణ, శివాలయ పూజారి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ప్రతి ఇంటా అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు.. డూడూ బసవన్నలు, హరిదాసుల రాకపోకలతో ఊరూ వాడ సందడిగా మారింది. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు గాలి పటాలు ఎగరవేస్తూ హుషారుగా గడుపుతున్నారు. పిండి వంటలు చేసే పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు. సంక్రాంతిని ఆనందంగా జరుపుకునేందుకు నగరం నుంచి పల్లెటూరుకు చేరుకున్నారు.



ఆనందోత్సాహాలతో పండగ జరుపుకోవాలి



వికారాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ భోగభాగ్యాలు, సకల సంపదలతో సంక్రాంతిని కనుల పండువగా జరుపుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు. ఇది రైతుల పండుగ అని వానాకాలం పంట ఇంటికి చేరిన సమయంలో జరుపుకుంటారన్నారు. భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, రేగి పళ్లతో ఇళ్లన్నీ సందడిగా మారాయన్నారు. అందరూ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

-గడ్డం ప్రసాద్ కుమార్,
శాసనసభ స్పీకర్



కొత్త వెలుగులు నింపాలి

తాండూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆశలతో జరుపుకునే సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఏడాదంతా రైతు కుటుంబాలకు మేలు జరిగి పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు.

- డాక్టర్ మహేందర్‌రెడ్డి,
ప్రభుత్వ చీఫ్‌విప్



సంబురాల సంక్రాంతి



వికారాబాద్‌లో చిన్నారులతో కిటకిటలాడుతున్న పతంగుల దుకాణాలు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జనవరి 13 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం భోగి మంటలతో సంబరాలు చేసుకున్నారు. తెల్లవారుజామునే ఇళ్లలో ఉన్న పాత వస్తువులను కుప్పగా పోసి భోగిమంటలు వేశారు. భోగి మంటల చుట్టూ తిరుగుతూ భోగి మంటలతో కాగిన నీళ్లతో స్నానం చేశారు. కాగా, భోగిపండ్లు అంటే రేగు పండ్లు. సూర్యుడి రూపం రంగు పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలు కలిపి పిల్లలపై పోసి ఆశీర్వదించారు.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న దృశ్యం

నేడు సంక్రాంతి.. రేపు కనుమ

మూడు రోజుల పండగలో భాగంగా నేడు నిర్వహించుకునే పండగ సంక్రాంతి. సూర్యుడు మకర రాశిలోకి కదలడం వల్ల మకర సంక్రాంతి అని పిలుస్తారు. అలాగే రేపటి కనుమను పశువుల పండుగగా వ్యవహరిస్తారు. పంటలు చేతికి అందడంతో తమకు సహాయ పడిన పశుపక్ష్యాదులను పూజించడం ఆనవాయితీ. అలాగే తిరుపతి పీపీపురం నల్లవళ్ల (ఎన్‌వీ) వారి ఫాంహౌజ్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ ఇన్‌చార్జి సునితారెడ్డి దంపతులు సోమవారం భోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ రమణారెడ్డి, చాముండేశ్వరి దంపతులు తదితరులు పాల్గొన్నారు.



భోగిమంట వేస్తున్న యువకులు

వైభవం.. గోదా కల్యాణం

మేడ్చల్ టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి పరిధిలోని గోదా రంగనాథ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ దంపతులు పద్మ జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో అర్చకులు కంతీ పురం నారాయణాచార్యులు, ఆలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర చారి, సుదర్శన్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే.. కీసర మండలం చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ , మల్లారావు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి పాల్గొన్నారు



చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో కల్యాణం



కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో

కొడంగల్, జనరవి 13 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగిన ధనుర్మాస పూజలు కల్యాణంతో ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన, గంటా అనంతరం శ్రీ ధరూరీ శ్రీనివాసచార్యులు తిరుప్పావై ప్రవచనం చేశారు. మకర సంక్రాంతి పండగ రోజున శ్రీదేవి భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామి తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. మరునాడు ఉదయం 8 గంటలకు వరహాస్వామి ఆలయ ఆవరణలో తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



యంనంపేట్ ఆలయంలో భక్తుల కోలాహలం

ఘటకేసర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా సమేత రంగనాయక స్వామి కల్యాణోత్సవంను సోమవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నర్రి మంజులశ్రీశైలం, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, పి కొండల్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులేనా?

జీతాలు అందక కార్మికుల అవస్థ

తాండూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తాండూరు బల్దియాలో పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. 200మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన పారిశుధ్యం, ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కార్మిక సంఘాల నేతలు జీతాలు ఇవ్వండి అంటూ కమిషనర్ ముందు మొరపెట్టుకున్నారు. జీతాలకు సరిపడా డబ్బుల్లేవ్, ట్యాక్స్ కలెక్షన్ చేయించి, సర్దుబాటు చేసి వారంలో జీతాలు చెల్లిస్తామని కమిషనర్ చెప్పినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ కార్మికులంటే కనీసం దుకాణదారులు సరుకులు ఉద్దెర ఇచ్చే పరిస్థితి లేదని వారు వాపోయారు. జీతాలు లేక పండుగ జరుపుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. 15వ తేదీ వరకు సెలవులు కావడంతో ఈనెల 16న సర్దుబాటు చేస్తే 20వ తేదీ తర్వాత కార్మికుల ఖాతాల్లో జీతాలు పడే అవకాశాలుంటాయి. లేదంటే ఈ నెలాఖారు దాటే అవకాశం ఉంది.

బస్తీ దవాఖానాకు సుస్తీ!

అందుబాటులో లేని మందులు, సిబ్బంది

సాధారణ వ్యాధులకూ దొరకని ఔషధాలు.. నేటికీ రంగారెడ్డి జిల్లా నుంచే సరఫరా

సిబ్బంది కొరతతో అందని సేవలు.. జిల్లాలో 70 పల్లె, 112 బస్తీ దవాఖానాలు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బస్తీ దవాఖానాలకు సుస్తీ చేసింది. సాధారణ జ్వరం, జలుబు తదితర వ్యాధులకు కూడా మందులు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో జ్వర పీడితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మందులు, సిబ్బంది లేక మూతపడే దిశలో ఉన్నాయి. పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 103 సబ్ సెంటర్లు ఉండగా అందులో 70 సెంటర్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్-పల్లె దవాఖానాగా అప్‌గ్రేడ్ చేశారు. జిల్లాలో ఒక జిల్లా ఆసుపత్రి, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 33 ఆరోగ్య ఉప కేంద్రాలు, 70 పల్లె, 112 బస్తీ దవాఖానాలున్నాయి.



మూసివున్న ఉద్దమర్రి పల్లె దవాఖానా

ఆస్పత్రులకు తాళాలు

వాతావరణ మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీజనల్ వ్యాధులతో

మిగతా 8వ పేజీలో...

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	సినీటౌన్ - మియాపూర్
ప్రెస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	స్కైమాల్ - సనత్‌నగర్
జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్య - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	జె.పి.సినిమాస్ - చందానగర్
టి.ఎన్.ఆర్ - కొంపల్లి	అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్	మరియు మీ అభిమాన థియేటర్లలో

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	సినీటౌన్ - మియాపూర్
ప్రెస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	స్కైమాల్ - సనత్‌నగర్
జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్య - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	జె.పి.సినిమాస్ - చందానగర్
టి.ఎన్.ఆర్ - కొంపల్లి	అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్	మరియు మీ అభిమాన థియేటర్లలో

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్యానించారు. కడ్తాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను, మాజీ సర్పంచ్‌ల కు రావాల్సిన పెండింగ్ బిల్లులపై పోరాడాలని కోరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలిగాయని, ప్రభుత్వ విధానాలతో పేదలకు పండుగల సంతోషం కూడ లేకుండా పోయిందని పేర్కొన్నారు. రైతు భరోసా సాయ మందక, ధరలు పెరిగి రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు మూడ అశోక్, సిద్దిగారి దాసు, రాయకంటి సురేశ్ ఉన్నారు.

ధర లేక పశువులకు మేతగా..



మర్పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కిలో వంద రూపాయలకు పైగా పలికిన టమాట ధర ప్రస్తుతం రూ.5 కూడా పలకడం లేదు. పండగ సమయంలో టమాట ధరకు కాస్తో కూస్తో ధర ఉంటుందని ఆశించినా టమాట రైతులకు నిరాశే మిగిలింది. టమాటాలు తెంచితే కనీసం కూళ్ల కూడా రావడం లేదంటూ పంటను పశువులకు మేతగా పెడుతున్నారు. మర్పల్లి మండలంలో దాదాపు 2 వేల ఎకరాలకుపైగా టమాట పంటను సాగు చేస్తున్నారు. దిగుబడి భారీగా ఉన్నా ధర లేకపోవడంతో పెట్టుబడిని నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాంబండ దేవాలయంలో శివమాల ధరించిన భక్తులు

పాంబండ ఆలయంలో శివమాల ధారణ

కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో భక్తులు శివమాల ధరించారు. సోమవారం పౌర్ణమి కావడంతో ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు శివమాల ధరించారు. భక్తులకు అర్చకులు పాండు శర్మ మాలలు వేశారు. 41రోజుల పాటు దీక్షలు చేసి శ్రీశైలం వెళ్లి మల్లికార్జునస్వామిని దర్శించుకుంటామని వారు తెలిపారు.



శ్రీనివాస్‌కు చెక్కు అందజేస్తున్న భాస్కర్‌గౌడ్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దోమ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.41వేల చెక్కును డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌గౌడ్ సోమవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల సాయిలు, బోయిని రఘు, విజయ్, భాస్కర్, మేకల ప్రసాద్, గొల్ల వెంకట్రాములు, ఎ.రాములు, పి.రాములు, మేకల యాదయ్య, మేకల శ్రీను, మేకల రమేశ్, బోయిని నర్సింహులు, బోయిని యాదయ్య, మేకల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరడమ్మ బోనాలు



మర్పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామస్తపూర్ గ్రామంలో గ్రామ దేవత ఊరడమ్మ బోనాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా సంక్రాంతి పండగకు ముందు బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంక్రాంతి పండగతో పాటు బోనాల పండగను నిర్వహించనున్నట్లు తెలిపారు.



సంఘం సభ్యులకు విరాళం అందజేసిన స్టాంప్ వెండర్ అశోక్ కుమార్

వీరశైవ బసవ భవన్ నిర్మాణానికి విరాళం

వికారాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వీరశైవ బసవ భవన్ నిర్మాణానికి స్టాంప్ వెండర్ అశోక్ కుమార్ సోమవారం సంఘం సభ్యులకు రూ.1,11,160 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబు

16 నుంచి హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు

- మూడు రోజులపాటు నిర్వహణ
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


విద్యుత్ దీపాలంకరణలో దర్గా ముఖద్వారం

కొత్తూర్, జనవరి 13:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో పేరు గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. కులమతాలకతీతంగా వేలాదిమంది భక్తులు దర్గాను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. దేశ, రాష్ట్ర స్థాయి నాయకులకు సైతం కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భావిస్తుంటారు. అయితే ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు కొనసాగే దర్గా ఉత్సవాలకు నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర రాజధానికి 45కిలోమీటర్ల దూరంలో కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో దర్గా ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ముస్లింలే కాకుండా గిరిజన కుటుంబాలు ఎడ్లబండ్లపై తరలివచ్చి దర్గాలో పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకుంటారు. ముఖ్యంగా ఇక్కడ చిన్నారులకు తల వెంట్రుకలు తీయిస్తే ఎలాంటి వ్యాధులైనా నయమవుతాయని భక్తుల నమ్మకం.అయితే మరో రెండు రోజుల్లో ఉర్సు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో జేపీ దర్గాను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాల కోసం రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

16 నుంచి ఉర్సు

దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 16నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు పేర్కొంది. 16న గంధోత్సవం, 17న దీపారాధన, 18న ఖత్మేఖురాన్‌తో ఉర్సు ఉత్సవాలు ముగింపు నిర్వహిస్తారు.

ప్రత్యేక బస్సులు

ఉత్సవాలను పురస్కరించుకొని హైద్రాబాద్‌లోని పలు డిపోల నుంచి జేపీ దర్గాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి అర గంటకు అఫ్జల్‌గంజ్, చార్మినార్ ప్రాంతాల నుంచి బస్సులు నడుస్తాయని తెలిపారు.

భారీ బందోబస్తు

ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ పర్యవేక్షణలో ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జేపీ దర్గాలో మూడు రోజుల పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ నర్సింహ్మరావు తెలిపారు. 200మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

ఏసీపీ శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

కొత్తూర్, జనవరి 13:(ఆంధ్రజ్యోతి) జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రశాంత వాతవారణంలో జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం దర్గా ఆవరణలో స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. ఉర్సు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకుగాను భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా వక్ఫ్‌బోర్డు సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంధోత్సవం రోజు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జారీ చేసిన పాస్‌లు ఉన్నవారికే దర్గాలోపలికి అనుతించబడునని తెలిపారు. పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలపాలన్నారు. భక్తులకు ఏమైనా సమస్యలు తలెత్తితే దర్గాలో ఉన్న పోలీస్ కంట్రోలింగ్‌కు సమాచారం అందించాలని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఎస్ఐలు శ్రీనివాస్, మురళీ గౌడ్, దర్గా సూపరింటెండెంట్ సత్తార్, ఆయా పార్టీల నాయకులు ఆగీర్ రవికుమార్, ఖాజాపాషా, గోపాల్‌నాయక్, రషీద్ పాల్గొన్నారు.

యాదాద్రిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పూజలు


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

వికారాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామిని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం దర్శించుకున్నారు. గోదా కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి, అధికారులు, అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో పాంబండ గిరి ప్రదక్షిణ


పాంబండ గిరి ప్రదక్షిణలో భక్తులు

కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ పాంబండ శివనామస్మరణతో మారుమోగింది. గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు హిందూ బంధువుల ఆధ్వర్యంలో గత 25 నెలలుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణలో వేలాది మంది పాల్గొన్నారు. మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాది తరలివచ్చారు. భక్తులకు అర్చకులు పాండు శర్మ స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిజిస్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, నిర్వాహకులు టీచర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

కొడంగల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సోదరులు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన మున్నూర్ కాపుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఆధ్యాత్మిక వేత్త, ప్రముఖ కవి భాస్కరయోగి మాట్లాడుతూ.. మున్నూరు కాపులు సమష్టిగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్‌కుమార్, ప్రకాశ్, నాగరాజు, సత్యనారాయణ, పెంటయ్య, వెంకటయ్య, తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లయ్య, నర్సిరెడ్డి, కానుకుర్తి రమేశ్, కిష్టప్ప, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


క్రీడాకారులతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సమానమేనని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండవెల్కిచర్లలో సోమవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో శుక్లవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిల స్మారకార్థం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను, రాంనగర్ గ్రామ పరిధిలోని సూర్యానాయక్ తండాలో తాలూకా స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ పరిధిలో గల పాంబండ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కులకచర్ల నుంచి దాదాపూర్‌కు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, ఎంఈవో హరిశ్చందర్, బ్లాక్ టు అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు రవినాయక్, స్థానికులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న తాండూరు డివిజన్ నాయకులు

తాండూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎదుట ఒగ్గు డోలు ప్రదర్శన ఇచ్చిన తాండూరు మండలానికి చెందిన విద్యార్థులు సన్మానించారు. మండలంలోని మల్కాపూర్ శివాలయంలో ఆదివారం ఒగ్గుడోలు ప్రదర్శన ఇచ్చిన సంగెంకలాన్‌కు చెందిన మనోజ్, అరవింద్‌లను యాదవ సంఘం తాండూరు డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీశ్, ఉపాధ్యక్షుడు పూజారి పాండు తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందూరు మల్లేశం, జినుగుర్తి నర్సింహులు దోమ భీమయ్య, గోపాల కృష్ణ, కిష్టప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు


ఘట్‌కేసర్‌లో దట్టంగా అలుముకున్న పొగమంచు

ఘట్‌కేసర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో సోమవారం దట్టమైన పొగమంచు వ్యాపించింది. ఉదయం ఆరున్నర గంటలకు ఉదయించాల్సిన భానుడు మంచు పొరలను చీల్చుకుంటు ఉదయం 9గంటలకు దర్శనమిచ్చాడు. పొగమంచు ప్రభావంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. సమీపంలో ఉన్న వాహనాలు సైతం కనిపించలేదు. ప్రస్తుత సీజన్‌లో నిత్యం రాత్రి సమయంలో మంచు కురుస్తున్నది. అప్పుడప్పుడు పొగమంచు కమ్ముకొని సూర్యోదయం ఆలస్యమవుతోంది. పొగమంచు వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది.

సంక్రాంతి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్నిపురస్కరించుకొని తాండూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ యేడాదంతా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగ పండి రైతులకు మేలు జరుగాలని ఆయన ఆకాంక్షించారు. ఇంటింటా భోగ, భాగ్యాలను నింపాలన్నారు.

అర్చకులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కొడంగల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అర్చకుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని దూప దీప నైవేద్య సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయాల్లో సేవలు అందిస్తున్న అర్చకులకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో అర్చకులు ఉన్నార్కన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు.

పండక్కి ఊరెళ్తే జాగ్రత్త

మూడుచింతలపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శామీర్‌పేట్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాలకు వెళ్లే ప్రజలు పలు సూచనలు, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఊరికి వెళ్తే చుట్టు పక్కలవారికి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాలనీలో అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

పండగ స్పెషల్ గేవర్

- తరాలు మారినా తరగని తీయదనం
- తాండూరులో సంక్రాంతికి ప్రత్యేకం
- ఆరు దశాబ్దాలుగా నోరూరిస్తున్న వంటకం



తాండూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు పేరు వినగానే కందిపప్పు, బండరాళ్లు, భిన్న సంస్కృతులు గుర్తొస్తాయి. ఇవి మాత్రమే కాదండోయ్.. తాండూరులో మరో ప్రత్యేకత ఉంది. అదే నోరూరించే 'గేవర్'. ఆరు దశాబ్దాల నుంచి సంక్రాంతి పండుగకు ప్రత్యేక తీపి వంటకంగా గుర్తింపు పొందింది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పర్సిల్ చేస్తారంటే ఈ వంటకం ఎంత ప్రత్యేకమైనదో అర్థం చేసుకోవచ్చు. సంక్రాంతి పండుగ పండుగకు స్పెషల్ వంటకంగా ఈ గేవర్‌ను తయారు చేస్తారు. ముఖ్యంగా శీతాకాలం మూడు నెలలు మాత్రమే గేవర్ తయారు చేయడానికి అనుకూలంగా ఉంటుందని, మిగతా కాలంలో తయారు చేయడానికి రాదని తయారీ దారులు ఆంధ్రజ్యోతికి వివరించారు. అదేవిధంగా గేవర్‌ను నెయ్యి, మైదా, పంచదార కలిపి తయారు చేస్తామని తెలిపారు.

'గేవర్' వంటకం వచ్చిందిలా..

నార్త్ ఇండియాలోని రాజస్థాన్ వంటకమైన గేవర్ తయారీని తాండూరు పట్టణానికి చెందిన హోటల్ యజమాని హన్మప్ప నేర్చుకొని తాండూరు ప్రాంత వాసులకు పరిచయం చేశారు. 60ఏళ్ల కిందట తాండూరు గంజ్‌లోని హన్మప్ప హోటల్‌లో గేవర్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఈ హోటల్‌తో పాటు ఇంటి వద్ద ఈవిక్రయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. హన్మప్ప మరణానంతరం తరతరాలుగా ఆయన కుటుంబం గేవర్ తయారీని ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

మూడు నెలలు డిమాండ్

డిసెంబరు నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు గేవర్ లభ్యమవుతుంది. డిసెంబర్ 31న కొత్త సంవత్సరం, మొదలుకొని సంక్రాంతి వరకు గేవర్ అమ్మకాలు జోరుగా ఉంటాయని తయారీదారులు వివరించారు. ఇంటి వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన బట్టీలో గేవర్ తయారు చేస్తారు. గేవర్ కిలో రూ.400లకు చొప్పున విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే బంధువులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా పార్సిల్‌ను తాండూరు నుంచి పంపిస్తారు.

చట్టాలపై అవగాహన అవసరం


బర్కత్‌పల్లిలో మాట్లాడుతున్న లీగల్ ఎడ్ కౌన్సిల్ ఎండీ గౌస్‌పాషా

పరిగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎడ్ కౌన్సిల్ ఎండీ గౌస్‌పాషా అన్నారు. మండలంలోని బర్కత్‌పల్లి గ్రామంలో సోమవారం చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలకు దూరంగా ఉంటారని చెప్పారు. ఒకసారి చేసిన తప్పులను మరోసారి చేయకుండా ప్రయత్నించాలని సూచించారు. ఇరుపక్షాల మధ్య గొడవలు, కేసులు ఉంటే మధ్యవర్థిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఏసమస్యకైనా మధ్యవర్థిత్వం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, కోర్టు సిబ్బంది రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాంబండ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో సోమవారం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా భక్తులు శ్రీ రామలింగేశ్వర స్వామికి కుంభాభిషేకం చేశారు. అన్నంతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సంక్రాంతి సంబురాల్లో భాగంగా భోగి పండగ కావడంతో ఉదయం నుంచే స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, రాములు, మండల గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, ఇప్పయిపల్లి నర్సింహులు, సంజీవ్‌గౌడ్ పాల్గొన్నారు.

మాది ప్రజా భరోసా ప్రభుత్వం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం పేదలకు భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పేదల పార్టీగా అవతరించిన కాంగ్రెస్ పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపేందుకు సంక్రాంతి సందర్భంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం నాలుగు పథకాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పబ్లిక్‌లో ప్రచారం పొందేందుకే హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచితంగా ప్రవరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రూ.21 వేల కోట్లు వృథా చేసిందని ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని పేదలకు ప్రతి సంవత్సరం రూ. 12వేలు చెల్లిస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇండ్ల పంపిణీలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదలకు మంజూరు చేస్తామన్నారు. పేద జర్నలిస్టులకు కూడా ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామని ప్రకటించారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను అందజేసి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు బాబర్‌అలీఖాన్, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేషం, బాలరాజుగౌడ్, చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రామ్ రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సరదాగా పతంగి ఎగురవేసి..

నిత్యం ప్రజలతో మమేకమయ్యే ఎమ్మెల్యే పతంగి ఎగురవేసి సరదాగా గడిపారు. సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ పట్టణంలో గాలిపటాలు ఎగురవేశారు. ఒక్కసారిగా తన బాల్యంలోకి వెళ్లినట్లు అనిపించిందని, 30 ఏండ్ల క్రితం తను పతంగులు ఎగురవేసిన ఘటనలను గుర్తు చేసుకున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వికారాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని మద్గుల్ చిట్టంపల్లి కౌన్సిలర్ గోపాల్ అన్నారు.మద్గుల్ చిట్టంపల్లిలో సోమవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి


పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు


బహుమతులు అందజేస్తున్న గూడూరు స్వప్నశ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి

కడ్తాల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు బాస్కర్ రెడ్డి అన్నారు. యువతీ, యువకులు పాశ్చాత్య పోకడలు వీడి భాతీయ సంస్కృతి సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకోవాలన్నారు. సంకాంత్రి పండుగను పురస్కరించుకొని కడ్తాల మండల కేంద్రంలో సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి నారాయణ రెడ్డి స్మారకార్థం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి అలరించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి స్వప్నకు రూ.10,116, రెండో బహుమతి శారదకు రూ.5116, మూడో బహుమతులు కావ్య, ప్రేమలత, సంతోషకు రూ.1,116 డాక్టర్ గూడూరు స్వప్నతో కలిసి అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమన్నారు కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, లక్ష్మణాచారి, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్, యాదయ్య, జంగారెడ్డి, రాములు, జావేద్, రాజేశ్, రవి, బుచ్చయ్య, భానుకిరణ్, రాంచందర్ నాయక్, మహేందర్ రెడ్డి, మహేశ్, మల్లేశ్, ప్రసన్న, భారతి, శైలజ, మాధవి, భిక్షపతి, రాజు, నర్సింహ్మమూర్తి, రాజేశ్, మంకి శ్రీను, భానుకిరణ్, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ 'కులకచర్ల' కమిటీ ఎన్నిక



కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొమ్ము శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా మొగులయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, రాజు, బాబు, కోశాధికారిగా హనుమంతు, బాలకృష్ణ, రాములు, బాబు, భాస్కర్, రాఘవేందర్, రాజశేఖర్, శ్రీను, సురేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్ పాల్గొన్నారు.


వికారాబాద్: ముగ్గు వేస్తున్న మహిళలు


వికారాబాద్: భోగి మంటలు వేస్తున్న స్థానికులు


తాండూరు: గాంధీనగర్‌లో భోగి మంటలు వేస్తున్న మహిళలు

అంబరాన్నంటిన భోగి సంబురాలు

వికారాబాద్/తాండూరు/తాండూరు రూరల్/పరిగి/పూడూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబురాల్లో భాగంగా సోమవారం భోగి వేడుకలు వికారాబాద్ జిల్లా కేంద్రంలో కనుల పండుగగా జరిగాయి. ఉదయం మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులను అందంగా వేశారు. తెల్లవారుజామున భోగి మంటలు కాల్చారు. మహిళలు ఇళ్లలో పిండి వంటలు చేయడంలో నిమగ్నమయ్యారు. పిల్లలు గాలిపటాలు ఎగుర వేస్తూ సందడి చేశారు. వికారాబాద్ పట్టణంలో మహాశక్తి చౌరస్తాలో ఏర్పాటు చేసిన పంతగుల దుకాణాల వద్ద పతంగులు కొనుగోలు చేసేందుకు యువకులు పోటీపడ్డారు. తాండూరులోని గాంధీనగర్‌లో మహిళలు స్థానిక కౌన్సిలర్ సంగీత ఠాకూర్ ఆధ్వర్యంలో భోగి మంటలు కాల్చి ఆటపాటలతో సందడిగా గడిపారు.


తాండూరులో గంగిరెద్దు సందడి

తాండూరులోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గంగిరెద్దు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పరిగితోపాటు, ఆయా గ్రామాల్లో ఉదయం భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఆడపడుచులు వాకిట్లో కల్లాపి చల్లి ముగ్గులు వేశారు. యువకులు, విద్యార్థులు ఆయా గ్రామాల్లో గాలి పటాలు ఎగరవేశారు. పూడూరు మండల కేంద్రంతోపాటు సోమన్‌గుర్తి, చెన్‌గోముల్, కంకల్‌తోపాటు తదితర గ్రామాల్లో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. యువకులు గాలిపటాలు ఎగుర వేయగా, ఇళ్లల్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ ప్రతినిధి/శామీర్‌పేట/ఘట్‌కేసర్: ధనుర్మాస పర్వంలో భాగంగా ముచ్చటగా మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ సోమవారం భోగితో ప్రారంభమైంది. భోగి మంటలతో పాటు ఇళ్ల ముందు మహిళలు ముగ్గులు వేసి వాటిలో గొబ్బెమ్మలు పెట్టి నవధాన్యాలతో అందంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు గాలిపటాలను ఎగరవేశారు. మండల కేంద్రం శామీర్‌పేట కట్టమైసమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాలలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అలియాబాద్ చౌరస్తా సమీపంలోని శ్రీ రత్నాలయ వేంకటేశ్వర్‌స్వామి ఆలయంలో భక్తుల కిక్కిరిసిపోయారు. అదేవిధంగా శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం జనాలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లముందు రంగురంగుల రంగవల్లులతోపాటు గొబ్బెమ్మలను పెట్టారు. భోగి మంటలు వెలిగించారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో పలు చోట్ల చిన్నారులకు భోగి పండ్లు పోసి పూజలు నిర్వహించారు.

పోలీసుల ఆటవిడుపు

తాండూరు: నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసులు సోమవారం సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్నారు. తాండూరు విలియామూన్ హైస్కూల్ మైదానంలో పోలీసులు సందడి చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో పాటు ఎస్‌ఐలు విఠల్‌రెడ్డి, శంకర్‌లు గాలిపటాలను ఎగురవేశారు.


తాండూరు: గాలిపటం ఎగురవేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


శామీర్‌పేట: బాబాగూడలో భోగి మంటలు


పరిగి: ముగ్గు వేస్తున్న యువతులు



పూడూరు: సోమన్‌గుర్తిలో..


తాండూరు: భోగి మంటలు వేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

క్రైం కార్నర్

టైరు పేలి ఆటో ట్రాలీ బోల్తా

● 15 మందికి గాయాలు


భువనగిరి బైపాస్ రోడ్డుపై పల్టీ కొట్టిన ఆటో ట్రాలీ

భువనగిరి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతరలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఆటోట్రాలీ టైరు పేలి అదుపుతప్పి పల్టీ కొట్టడంతో 15మంది భక్తులు గాయపడ్డారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి బైపాస్ రోడ్డుపై ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఏదులాబాద్‌కు చెందిన 15మంది సమీప బంధువులు ఒకే ఆటో ట్రాలీలో వరంగల్ జిల్లాలో సాగుతున్న ఐనవోలు మల్లన్న జాతరకు ఆదివారం వెళ్లారు. దైవ దర్శనం తదితర కార్యక్రమాలు ముగించుకుని సోమవారం వెళుతుండగా భువనగిరి బైపాస్ రోడ్డుపై వారు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ టైరు పేలి అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ సహా అందరూ బైపాస్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. మల్లేశ్, లక్ష్మి, బాలమ్మ, శ్రీను, రాజు, సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా మిగతా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందరినీ 108 అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారందరినీ ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులు బైపాస్‌రోడ్డుపై పడినప్పుడు ఆ మార్గంలో భారీవాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామయంపేట్‌కు చెందిన ప్రశాంత్ (26) బతుకుదెరువు నిమిత్తం తూంకుంటకు వచ్చి కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. తూంకుంటలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురైన వ్యక్తి పెట్రోల్ బంక్ పరిసరాల్లోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. సూసైడ్ నోట్‌లో ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తన భార్యను ఎవరూ ఏమీ అనొద్దని, కుటుంబసభ్యులు తనను బాగా చూసుకోవాలని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

ధారూరు, జనవరి 13: రోడ్డుపై వెళుతున్న వృద్ధుడిని బైక్‌పై వెళ్తున్న కానిస్టేబుల్ ఢీకొట్టాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దోర్నాల్ గ్రామానికి చెందిన తానెం నర్సయ్య అనే వృద్ధుడు ధారూరు ఎస్‌బీఐలో డబ్బులు విత్‌డ్రా చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో ధారూరు పీఎస్ కానిస్టేబుల్ అనంతయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నర్సయ్యను ఢీకొట్టాడు. దీంతో నర్సయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతన్ని వెంటనే 108 అంబులెన్స్‌లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్‌పై వస్తున్న కానిస్టేబుల్ వృద్ధుడిని ఢీకొనడమే కాకుండా అతడే బైక్‌కు తగిలాడని స్థానికులతో బుకాయించి వెళ్లినట్లు సమాచారం. పెట్రోల్ పంపు, వైన్స్ షాప్, ఎస్‌బీఐ బ్యాంకు సీసీ కెమెరా పరిశీలిస్తే ప్రమాదం ఎలా జరిగిందనేది తెలుస్తుందని, ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్ అనంతయ్యపై చర్యలు తీసుకోవాలని నర్సయ్య కుమారుడు సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బస్తీ దవాఖానాకు సుస్తీ!

(5వ పేజీ తరువాయి)

జ్వర పీడితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారు. వీరంతా వైద్యం కోసం పల్లె దవాఖానాలకు వెళితే మందులు అందుబాటులో లేవని చెబుతుండటం గమనార్హం. పలు చోట్ల వైద్యం కోసం వచ్చే వారికి సమాధానం చెప్పలేక దవాఖానాలకు తాళాలు వేస్తున్న పరిస్థితి. మరికొన్ని చోట్ల మెడికల్ సిబ్బంది కొరత కారణంగా కనీస సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

మందుల నిల్వలు లేక..

ఇటీవల నిర్వహించిన దిశ సమావేశంలో జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు బస్తీ దవాఖానాల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. మేడ్చల్ జిల్లాకు ఇప్పటి కూడా రంగారెడ్డి జిల్లా ద్వారానే మందులు సరఫరా చేయడంపై పలువురు ఎమ్మెల్యేలు అభ్యంతరం కూడా తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయ భవనం పైఅంతస్తు కేటాయించామని ఇక నుండి మేడ్చల్ జిల్లా మందుల సరఫరా ఇక్కడి నుంచే జరుగుతుందని తెలిపారు. మందుల నిల్వలు లేక వైద్య సేవలు కూడా అంతంత మాత్రమే అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వైద్యాధికారులు దీనిపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

మహేశ్వరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో నవభారతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జైత్వారం నారాయణరెడ్డి, మదిలపురం ప్రేమలమ్మ జ్ఞాపకార్థం రాజశేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సౌజన్యంతో ప్రారంభమైన స్వామి వివేకానంద 23 వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. వీరేందర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు

● వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ
● కూలీల కొరతతో ఇబ్బందులు

దుద్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. వేరుశనగ పంట తీయడం, కంది కోతలు లాంటి వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఓ పక్క వరినాట్లు, వేరుశనగ, కంది కోతల నూర్పిడి దశలో పనులు సాగుతున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతుండటంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. కూలీల కొరత ఉన్న గ్రామాల రైతులు పొరుగు గ్రామాల నుంచి మహిళా కూలీలను అదనంగా ప్రయాణ చార్జీలు చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. ఒక్కోకూలీకి రోజుకు రూ.600నుంచి రూ.700వరకు చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దినసరి కూలీ రేటుతో రెట్టింపు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరినాట్ల యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.


వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పెట్టుబడి పెరిగింది



ఇప్పటికే పంటకు పెట్టుబడి ఎక్కువైంది. వరి నాట్లు, వేరుశనగ తీయడం రెండు ఒకే సారి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. కూలీల రేటు అమాంతం పెరిగింది. వరి నాట్లు వేసే యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది.

- రెబ్బని యాదయ్య, రైతు, పోలెపల్లి

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● క్షేత్రగిరిలో నాలుగు రోజుల పాటు జాతర
● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మేడ్చల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం ఘణాపూర్ క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు జాతరతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి వేదపండితులు తెల్లవారుజామునే సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ తదితర కార్యక్రమాలు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నేడు(మంగళవారం) సామూహిక కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మకర సంక్రాంతి, స్వామివారి మొక్కుబడి సేవలు, సామూహిక అర్చనలు, 15న కనుమ రోజున స్వామివారి కల్యాణం, పల్లకీసేవ, జాతర మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయం


ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి

మర్రిచెన్నారెడ్డి సేవలు మరువలేనివి


చెన్నారెడ్డికి నివాళులర్పిస్తున్న అభిమానులు

వికారాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివని ఎస్‌ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ మందారిక అన్నారు. మర్రిచెన్నారెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ఎన్నెపల్లి చౌరస్తాలోని విగ్రహం, ఎస్‌ఏపీ కళాశాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కన్వీనర్ అనంత్‌రెడ్డి, కమాల్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ శ్రీరాములు, పూర్వ విద్యార్థి సంగీతపు రాజలింగం, ఎన్నెపల్లి వెంకట్‌రెడ్డి, గొట్టిముక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే సమన్యాయం


బొంరాస్‌పేట్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, ఉప కులాలకు సమన్యాయం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సి.విజయ్‌కుమార్ అన్నారు. మాదిగల చైతన్య యాత్రలో భాగంగా సోమవారం బొంరాస్‌పేట్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై.అశోక్, ఎంఎస్‌పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, మాజీ అధ్యక్షుడు బచ్చలకూర స్వామి, దండోర కళామండలి నాయకులు గుజ్జలి రాంచందర్ తదితరులు మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టే లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీకాంత్, మల్లికార్జున్, సుభాష్, మల్కప్ప, ప్రకాశ్, రమేశ్‌బాబు, లక్ష్మణ్, వెంకటయ్య, గోవర్ధన్, ప్రశాంత్, బందెయ్య, రాములు, బాల్‌రాజ్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆపదలో పేదలను ఆదుకోవడమే ధ్యేయం


ఆర్థిక సాయం అందజేస్తున్న తుంకి రమేశ్

శామీర్‌పేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆపదలోఉన్న పేదలను ఆదుకోవడమే తన ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్ అన్నారు. మజీద్‌పూర్ గ్రామానికి చెందిన అంతాయిపల్లి బాలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మల్లేశ్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు వీరయ్యగౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆర్థిక సాయం

బంట్వారం: మండలంలోని మంగ్రాస్‌పల్లి గ్రామానికి చెందిన అంజిలయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బంట్వారం కానిస్టేబుల్ పరమేశ్వర్ సోమవారం పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట అంజిలయ్య స్నేహితులు దోరేటి సుధాకర్, నజీమ్, నరేందర్, శేఖర్, తదితరులు ఉన్నారు.

కంకర వేశారు.. వదిలేశారు

● అసంపూర్తిగా బీటీరోడ్డు నిర్మాణం
● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

చౌడాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి నుంచి కన్మన్ కాల్వ గ్రామం వరకు కంకరవేసి బీటీ రోడ్డు వేయడం మరిచారు. దీంతో ఆరునెలలుగా ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొత్తపల్లి గ్రామానికి వస్తుండగా గ్రామస్థులు గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకొని వెనక్కి పంపించారు. కొన్ని నెలలకే బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే కొత్తపల్లి నుంచి కన్మన్ కాల్వ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుత పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో సదరు కాంట్రాక్టర్ కంకర వేసి బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. అయితే ఆరునెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర వేసి వదిలేశాడు. దీంతో వర్షాకాలంలో వర్షాలకు రోడ్డు రెండు వైపులా కోతకు గురైంది. కంకర రోడ్డుపై వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మహబూబ్‌నగర్ నుంచి వచ్చే బస్సు కూడా నిలిచిపోయిందని, దీంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.


కంకర వేసి వదిలేసిన కొత్తపల్లికి వెళ్లే రోడ్డు

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి



కొత్తపల్లి నుంచి కన్మన్ కాల్వ గ్రామం వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి. కంకర వేసి వదిలేయడంతో రోడ్డుపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. - హన్మంతు, కొత్తపల్లి